# ఫంక్షన్

ఎస్వీ కృష్ణజయంతి

"ఆహ్వానం : రియల్ ఎస్టేట్ రంగంలో గత దశాబ్దకాలంగా విజయవంతంగా పేరొందిన ప్రముఖ సంస్థ 'మట్టిపాల' ఎస్టేట్‌వారి ఆహ్వానం ప్రముఖ చలనచిత్ర, టీవీ రంగాల్లో ప్రసిద్ధులైన నటీనటుల సమక్షంలో బంపర్ డ్రా జరుపబడును. కనుక ఈ వార్షికోత్సవ సభకి సభ్యులందరూ విచ్చేసి విజయవంతం చేయ ప్రార్థన".

ఇన్విటేషన్ పెద్దగా చదివి వినిపించాడు సీతాపతి. అది విని ముఖం చింకి చాటంత చేసుకుంది లోపల జడ వేసుకుంటున్న సీతామాలక్ష్మి.

"సినిమావాళ్ళా? ఎవరెవరొస్తున్నార్ట?" గబగబా బైటకొస్తూ ఆసక్తిగా అడిగింది.

"ప్చ్. ఇన్విటేషన్ కార్డ్‌లో వాళ్ళెవరో ఇవ్వలేదే. ఎవరో నంబర్‌వన్, టూ హీరో హీరోయిన్లే వస్తున్నారులా ఉంది. చూడబోతూ అడ గడం ఎందుకు? ఇంకెంత ఎల్లుండి సాయంత్రం..." అన్నాడు చేతిలోని కార్డ్‌ని టీ.వి మీద పెడ్తూ.

"పెద్ద హీరో హీరోయిన్లంటే... నా అభిమాన హీరో హీరోయిన్లు లోకేష్, తిలోత్తమలు వస్తారా? ఇపుడు వాళ్ళిద్దరే కదా టాప్‌స్టార్స్. వాళ్ళే వస్తే బాగుండు" అంది ఆశగా కళ్ళు తిప్పుతూ.

"టాప్‌స్టార్సే కానీ వాళ్ళు బిజీగా ఉంటారు. ఇలాంటి పాపులారిటీ లేని పార్టీలకి రారు. వాళ్ళ పేర్లు వాడుకోవడమే గొప్ప. వాళ్ళకా టైంలో తీరిక ఉంటుందో, ఉండదో వాళ్ళకే తెలీదు. అందుకే ముందుగా ఎనౌన్స్ చేయరు. పేర్లు చెప్పకుండా ఊరిస్తారంతే..."

"ఆ... అయినా ఎవరొస్తేనేం లెండి. కాస్త తెలిసినవాళ్ళు, పేరున్న వాళ్ళొస్తే నయమే. నేనింతవరకూ ఏ ఒక్క సినిమాస్టార్‌ని నిజంగా చూడలేదు. మా రాజమండ్రి ఫ్రెండ్ రామలక్ష్మి మాత్రం షూటింగ్‌కి వాళ్ళూరు వచ్చిన వారందర్నీ వెళ్ళి చూస్తుందట. నేను కలిసినపుడల్లా నన్ను ఎగతాళి చేసేది. హైదరాబాదులో ఉండి కూడా ఏ ఒక్కర్నీ చూడలేదా అని! అదో వింతలా చెప్పేది. ఎంత సిగ్గు చేటు? ఈసారి చూడండి. రేపు ఫంక్షన్ కొచ్చిన స్టార్‌ల గురించి దానికెన్ని పేజీల ఉత్తరం రాస్తానో...! కుళ్ళుకుని ఛావాలది..."

సీతాపతి టీ.వీ చూడ్డంలో మునిగిపోయాడు.

సీతాపతి, సీతామహాలక్ష్మి 'మట్టిపాల' ఎస్టేట్‌లో ఓ 200 గజాల స్థలానికి ఇన్‌స్టాల్‌మెంట్ స్కీంలో డబ్బు కడుతున్నారు. అందులో స్కీము సభ్యులు వేలల్లో ఉన్నారు. వారికి ఏడాదికోసారి డ్రా తీసి లక్కీడిప్‌లో గెలుపొందినవారికి ఓ రెడీమేడ్ ఫ్లాట్ బహుమతిగా ఇస్తున్నారు. దానికోసం ఎంతోమంది వేలకి వేలు స్కీమ్‌కి చెల్లిస్తున్నారు. వాళ్ళల్లో సీతాపతి, సీతామాలక్ష్మి జంట ఒకటి.

ఈసారైనా ఆ ఫ్లాట్ తనకొస్తే బాగుంటుందన్న ఆశతో సీతాపతికి ఫంక్షన్‌లో తన జీవితంలో మొట్టమొదటిసారిగా సినిమా స్టార్లను చూడబోతున్నానన్న సంతోషంతో



సీతామాలక్ష్మికి నిద్రే పట్టకుండా పోయింది.

సీతామాలక్ష్మి ఏకంగా కలల్లోనే విహరిస్తోంది. సినిమా స్టార్ల చేతుల మీదుగా ఆటోగ్రాఫ్‌లందుకుంటూ ఓ హీరోయిన్ ఆమె చేతికి షేక్ హాండివ్వడం, "బాగున్నారా?" అని ఆ హీరోయిన్ తనని ఆప్యాయంగా పలకరిస్తున్నట్లు. హృదయం సంతోషంతో నిండి ఉక్కిరిబిక్కిరయింది సీతామాలక్ష్మి.

* * *

ఫంక్షన్ ఎప్పుడో సాయంత్రం ఆరుగంటలకనగా సీతామాలక్ష్మి ఉదయం ఆరింటికే లేచి ఇంట్లో పన్లన్నీ చకచకా పూర్తి చేసి మేకప్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది.

ఉన్న చీరలన్నీ కట్టింది. విప్పింది. గోల్డు నగలన్నీ వేసుకొని చూసుకుంది. రకరకాల హెయిర్ స్టయిల్స్ మార్చింది. ముఖానికి ఏవేవో క్రీములు పూసింది. ఏదో వెలితిగా, అనుమానంగా తోచింది. భర్తని అడిగింది.

"ఏవండీ.... బ్యూటీ క్లినిక్‌కెళ్ళేదా?"

ఎగాదిగా చూశాడు సీతాపతి.

"ఏమేవ్! నీకేమన్నా పెళ్ళి చూపులను

కుంటున్నావా ఏంటి కొంపదీసి?'' అంటూ జోకాడు.

''రెండోసారి ఆ యోగం లేదని నా చిన్నప్పుడే సిద్ధాంతి చెప్పార్లెండి'' నీరసంగా అంది.

ఆ మాటకర్థం ఏంటో వెంటనే అర్థం కాలేదు సీతాపతికి.

ఆ తర్వాత అర్థమై ఉలిక్కిపడి, అనుమానంగా చూసేసరికి సీతామాలక్ష్మి లోపలికెళ్ళిపోయింది.

ఆ సాయంత్రం దాకా ముస్తాబవుతూనే ఉంది సీతామాలక్ష్మి. బయల్దేరేముందు సీతాపతి ఓసారి భార్య వేపు చూశాడు. పట్టుచీర, ఒంటినిండా గోల్డు నగలూ ధరించి గంగిరెద్దులా తయారైంది. ఆమెని చూసి గుండెలు బాదుకున్నాడు సీతాపతి. లబోదిబోమని మొత్తుకున్నాడు.

''ఏమేవ్! ఒంటినిండా ఇన్ని నగలు దిగేసుకున్నావ్. ఫంక్షన్లో ఏ దొంగ వెధవన్నా కన్నేశాడంటే మన కొంప మునుగుతుంది..'' అన్నాడు.

అది విని తేలిగ్గా దీర్ఘాలు తీసింది సీతామాలక్ష్మి.

''ఆహా... నా బంగారం పోతే నేనూరు కుంటానా ఏంటీ? వాడు ఏ మూల ఉన్నా సరే. తేలిగ్గా బైటికి లాగి మరీ బడిత పూజ చేయనూ?'' అంది.

''నిజమే. అందుకు తగినదానివే నువ్వు. మనసులోనే అనుకున్నాడతను. ఇద్దరూ ఫంక్షన్‌కి బయలుదేరారు.

* * *

''మట్టిపాల ద్వితీయ వార్షికోత్సవానికి విచ్చేస్తున్న ప్రముఖ చలనచిత్ర, టీవీ రంగ నటీనటులకు ఇవే మా ఆర్థిక శుభాకాంక్షలు..'' అని రాసి ఉన్న బ్యానర్లను చూసి ఆ ఎస్టేట్ స్కీమ్ సభ్యులు కాని వాళ్ళు, దారిన వస్తూ పోతూ చూసినవాళ్ళు కూడా పోలోమంటూ ఆ ఫంక్షన్ షామియానాలోకి జొరబడసాగారు.

జనంతో ఆ ఆవరణంతా క్రిక్కిరిసిపోయింది.

సీతాపతి, సీతామాలక్ష్మి చాలా కష్టపడి ఓ రెండు కుర్చీలు దొరకబుచ్చుకొని కూర్చున్నారు. జనం ఇంకా వస్తూ పోతూనే ఉన్నారు.

అంతా కూర్చుని ఎదురుగా కన్పిస్తున్న స్టేజీ వేపే చూస్తున్నారు.

ఇంతలో ఏదో ఆర్కెస్ట్రా కార్యక్రమం మొదలయింది.

సినిమా హీరోయిన్ల లెవెల్లో స్టయిలు కొడుతున్న నలుగురు చెక్కమొహం లేడీ ఆర్టిస్టులు ఫుల్లు మేకప్‌లో వేదిక మీద వయ్యారాలు ఒలకబోస్తున్నారు.


అందులో ఒకామె ముందుకొచ్చి మైక్ అందుకుంది.

''మట్టిపాల రియల్ ఎస్టేట్ స్కీం సభ్యులందరికీ నా నమస్కారములు. మరి కొద్దిసేపట్లో మీ అభిమాన సినిమా, టీవీ నటీనటులు మీముందుకు రాబోతున్నారు. వారు బయల్దేరిన కారు రష్‌లోంచి బయటపడడానికి కొంత టైం పడ్తుందని ఫోన్ చేశారు. అందుకే అప్పటిదాకా మీకు ఎంటర్‌టైన్‌మెంట్‌గా మీరందరూ మెచ్చే నచ్చే వినోద కార్యక్రమం... సినీగీతాల ఆలాపన! మేం నలుగురం మీకు నచ్చిన, మీరు కోరిన పాటలు పాడి మిమ్మల్ని ఆనందింపజేస్తాం..'' అంది వయ్యారంగా తెలుగుభాషని అష్టవంకర్లు తిప్పి స్టైయిల్‌గా మాట్లాడ్తూ.

వాళ్ళ అవతారాలు చూసి ఇదేదో రికార్డింగ్ డాన్స్ వ్యవహారం అనుకొని, కాస్త ఖుషీపడ్డ మొహాలు కాస్తా ఒక్తి సినిమా పాటలనేసరికి వేలాడిపోయాయి.

ఆమె పాటందుకుంది.

''సిరిమల్లెపువ్వా... సిరిమల్లెపువ్వా సిరిమల్లెపువ్వా చిన్నారి చిలకమ్మా... నావాడు ఎవరే... నా తోడు ఎవరే ఎన్నాళ్ళకొస్తాడే...''




ఆ పాటకనుగుణంగా ఆర్కెస్ట్రాలోంచి మ్యూజిక్ మొదలైంది.

ఆ పాట పల్లవికి సినిమాలో ట్యూన్ కట్టినాక చరణం దగ్గర వినిపిస్తున్న 'డిమ్‌చిక్కు డిమ్‌చిక్కు' అన్న ట్యూన్ ప్రేక్షకుల్లో మొదట కాస్త ఉల్లాసాన్ని కల్గించింది. వాళ్ళు కూడా రిథమిక్‌గా తాళం వేస్తూ, ''ఆహా ఏం ట్యూన్ కట్టాడు? సరిగ్గా పాటకి సరిపోయేలా ఉంది. అచ్చం సినిమావాళ్ళు కట్టినట్లే ఉంది'' అంటూ మెచ్చుకోసాగారు.

పాట పూర్తయింది. అక్కడక్కడ కొద్దిగా చప్పట్లు విన్పించాయి.

ఆ యాంకర్ ఈసారి మరో ఆర్టిస్ట్‌కి పాడే వంతు ఇచ్చి తను వెనక్కి వెళ్ళింది. ఆమె వచ్చి పాటందుకుంది.

మళ్ళీ ఆర్కెస్ట్రా మొదలయింది.

''బావలు సయ్యా.... సయ్ మరదలు సయ్యా... రింబోల రింబోల రింబోలా...''

మళ్ళీ అదే ట్యూన్.

పల్లవి దాకా సిన్మాట్యూన్ వినిపించాక చరణం దగ్గరికి రాగానే మళ్ళీ 'డిమ్మచిక్ డిమ్మచిక్కు'' మంటూ విన్పించింది.

వింటున్న ప్రేక్షకులు తెల్లబోయారు.

''ఇదేంటి మళ్ళీ అదే ట్యూనింగా?'' అనుకున్నారు.

అలా వరుసగా నాలుగు పాటలకీ ఇదే తీరు కొనసాగడంతో ప్రేక్షకులకి ఆ ఆర్కెస్ట్రా వాళ్ళ మీద విసుగొచ్చింది.

''వీళ్ళ కిది తప్ప ఇక వేరేది రాదు కాబోలు'' అనుకున్నాక చప్పట్లు కొట్టడం మానివేశారు.

ఆర్టిస్టులు వాళ్ళిష్టం వచ్చినట్లు పాడుతున్నారు.

ఆడియన్స్‌లోంచి చిత్రవిచిత్రమైన ధ్వనులు, నిట్టూర్పులు మొదలయ్యాయి.

''ఇంతకీ ఆ వచ్చే సినిమా, టీవీ స్టార్‌లెవరు? కనీసం వారి పేర్లన్నా చెప్పండి?'' అంటూ అక్కడక్కడా గొణుక్కోవడం ప్రారంభించారు.

కానీ ఎస్టేట్ సిబ్బంది మాత్రం ఎవరూ ఆ రహస్య ముడి మాత్రం విప్పడం లేదు.

స్టార్స్ బయల్దేరిన కారు రష్‌లో ఇరుక్కుపోయిందని, కొంత టైం పడ్తుందని ఎనౌన్స్ చేసి చాలా టైమ్ గడిచిపోయింది.

''ఇంకా వస్తారు ఇంకా వస్తారు'' అని ఆశగా ఎదురుచూస్తూనే ఉన్నారంతా.

జనంలోంచి ఎవరు ఎవరో సరిగ్గా కనబడక ఉండి ఉండి అక్కడక్కడ జనం గుంపులుగా లేచి నిలబడి చూస్తున్నారు. వాళ్ళని చూసి వెనకవాళ్ళు కూడా సినిమా స్టార్‌లు వచ్చారేమోనని లేచి ఆత్రంగా ఎగబడి ఎగబడి చూస్తున్నారు.

పాటల కార్యక్రమం అయిపోయింది.

యాంకర్‌గా వ్యవహరిస్తున్న ఆర్టిస్టు మళ్ళీ లేచి మైకందుకుంది.

''ప్రేక్షకులకు శుభవార్త. మీరు ఎప్పుడా ఎప్పుడా

అని ఎదురుచూస్తున్న సినిమాస్టార్‌లు వచ్చేశారు.." అంటూ కేకలతో చెప్పింది.

"ఏంటీ... వచ్చేసారా? ఎక్కడ?" జనమంతా ఒక్కసారిగా లేచారు. మళ్ళీ కంటిన్యూ చేసిందామె.

"దారిలోనే ఉన్నారు. ఇంకా ఐదు నిమిషాలు మాత్రమే! వాళ్ళు ఎవరో కాదు. మీకు నచ్చిన, మీరు మెచ్చిన పేరొందిన నటీనటులే.."

"హూ.....ం......!" మళ్ళీ నీరసంగా కూలబడ్డారంతా.

సీతాపతి, సీతామాలక్ష్మిల సంగతి సరేసరి.

సీతామాలక్ష్మి మేకప్పంతా చెదిరిపోతోంది. మాటిమాటికీ పర్స్ తెరిచి అందులో ఉన్న అద్దంలో చూసుకుంటూ దిగులు పడుతోందామె.

సీతాపతి టెన్షన్ వేరు. లక్కీ డ్రాలో ఫ్లాట్ ఎవరికొస్తుందా అని తెగ ఆలోచిస్తూ అదేదో తమకే రావాలని, వస్తే అన్ని పుణ్యక్షేత్రాలు దర్శించుకుంటానని ముక్కోటి దేవుళ్ళకు మొక్కుకుంటున్నాడు.

క్షణక్షణానికి అతడిలో టెన్షన్ పెరిగిపోతోంది. ఆర్కెస్ట్రా మీద గానీ, ఆర్టిస్టులూ, పాటలు, స్టార్‌ల మీదగానీ వీసమెత్తు ఆసక్తి కూడా కలగడం లేదతనికి.

అంతలో ఆ యాంకర్ మైక్‌లో ఎనౌన్స్ మొదలుపెట్టింది.

"ఇప్పటిదాకా మేం పాడిన పాటల్ని ఎంతో ఓపిగ్గా కూర్చుని విన్న అఖిల జనప్రేక్షక మహాశయులకు నా కృతజ్ఞతాభివందనాలు. ఇపుడు మీరు నచ్చే మెచ్చే మరో కార్యక్రమం. పలు విదేశాల్లో ఎన్నో ప్రదర్శనలిచ్చి దేశవ్యాప్తంగా విశేషఖ్యాతి నార్జించిన ప్రఖ్యాత మిమిక్రీ ఆర్టిస్టుగారి మిమిక్రీ ప్రోగ్రామ్."

"ఆహా... మిమిక్రీ ప్రోగ్రామా? ఎవరు..... నేరెళ్ళ వేణుమాధవ్వేనా?" అంటూ జనం అంతా తలలు పైకెత్తి చూశారు.

ఎవరో కాలేజీ కుర్రాడు లేచి మైకు ముందు నిలబడ్డాడు.

"ఈ పిల్లకాయా...కాకలు తీరిన మిమిక్రీ ఆర్టిస్ట్?" చప్పబడిపోయారంతా.

వాళ్ళనుకున్నట్లుగానే ఆ కుర్రాడు కుక్క అరిచినట్లు "భౌ భౌ" అని, పిల్లి అరిచినట్లు 'మ్యావ్ మ్యావ్' మని, మేకపోతు అరిచినట్లు 'మే... మే..' అని కేకలు పెట్టి, మహా అనుభవం ఉన్నవాడికి మల్లె ఫోజు పెట్టి నమస్కరించి స్టేజీ దిగి వెళ్ళిపోయాడు.

ప్రేక్షకుల నుంచి ఎలాంటి స్పందనా లేదు.

తర్వాత తమను బలి చేసే మహత్తర కార్యక్రమం ఏంటా అని దీనంగా ముఖం పెట్టుకొని చూడశాగారు.

ఆమె మళ్ళీ ఎనౌన్స్ చేసింది.

"ప్రేక్షకులకు ముందుగా ఓ క్షమాపణ విన్నపం..."

"ఇంకేముందీ... సినిమావాళ్ళు రావడం లేదేమో... ఇంకెందుకు పోదాం పదండి" అనుకుంటూ ఓ చోట గుంపుగా లేచి నిలబడ్డారు జనం.

"మీ అభిమాన సినిమాస్టార్‌లు బయలుదేరిన కారు రావడానికి ఐదు నిమిషాల టైం పడ్తుందన్నాం. కానీ దార్లో ట్రాఫిక్ జామ్ అయినందువల్ల ఇంకాస్త టైం పడ్తుందని ఫోన్ చేశారు గనుక... ఇంకొద్దిసేపు మాత్రమే వెయిట్ చేయవలసిందిగా కోరుతున్నాం. ఇపుడు మరో ఎక్సలెంట్ ప్రోగ్రామ్... కూచిపూడి డాన్స్..." అని గబగబా చెప్పేసి వెళ్ళిపోయింది.

నీరసంగా ఆవులించబోయిన జనం కూచిపూడి డాన్స్ అనగానే లేని ఊరట తెచ్చుకుంటూ 'గుడ్డిలో మెల్ల' అనుకుంటూ చూద్దామని సర్దుక్కూర్చున్నారు.

ఓ ఏడేళ్ళ పాప కూచిపూడి దుస్తుల్లో దర్శనమిచ్చింది.

"ఇదేంటి డాన్స్ చేసేది చిన్నపిల్లా?" మళ్ళీ నీరసం ఆవహించింది వారిలో.

దానికి తగ్గట్టుగానే ఆ పిల్ల కూచిపూడి డాన్సంటూ సిన్మా డాన్సులు, ఏవో పిచ్చిగంతులు వేయసాగింది.

సీతాపతికి చిర్రెత్తింది. కారణం....

తన ప్రక్కనున్న వ్యక్తి ఆ పాపడాన్స్‌కి తన్మయుడైపోయి, పరవశంగా తలూపుతూ చూస్తూ చేత్తో తాళం వేస్తున్నాడు.

వింత జంతువును చూసినట్లు చూశాడు సీతాపతి అతడివంక.

"ఏం బాబూ... ఆ పిల్ల వేసే పిచ్చి డాన్స్ నీకంత పరవశంగా అన్పిస్తోందా? అసలు నువ్వెపుడైనా కూచిపూడి డాన్స్ చూశావా?" అనడిగాడా వ్యక్తిని.

ఆ వ్యక్తి సీతాపతి వేపు తిరిగి చెమర్చిన కళ్ళతో చెప్పాడు.

"ఆ పాప మా పాపేనండీ... మొన్న మొన్ననే గురువుగారు' కోతి దండం' గారి దగ్గర డాన్స్ నేర్చుకోవడం అయిపోయింది. ఇదే మా పాప అరంగేట్రం..." అన్నాడు.

గతుక్కుమన్నాడు సీతాపతి.

"హిహ్హీ... ఓ..... మీ పాపా? బావుంది బావుంది చాలా బాగా చేస్తోందండీ కూచిపూడి డాన్స్... అన్నట్టు కూచిపూడిలో కొత్త విధానం కనిపెట్టినట్లుందే?" అన్నాడు.

"అవునండీ... అంతా దాని గురువుగారు 'కోతిదండం' గారి దయ..."

మరి కిక్కుర్రుమనలేదు సీతాపతి.

అంతలో "వచ్చేశారు... వచ్చేశారు... సినిమా, టీవీ స్టార్‌లు వచ్చేశారు..." అంటూ విన్పించింది.

అంతే! ఒక్కసారిగా జనమంతా లేచి నిలబడ్డారు.

వెనుక నుంచి ఓ నటి, ఓ నటుడు వస్తూ కన్పించారు. సీతామాలక్ష్మి ఆశగా, ఆత్రంగా చూసింది. వారిద్దర్నీ చూడగానే వాళ్ళెవరో గుర్తు రాలేదు జనాలకి. 'ఎవరా, ఎవరా' అని గుచ్చి గుచ్చి చూడసాగారు, పరిచయం మొదలయింది.

"ప్రేక్షకులకు నమస్కారం. మీరంతా ఎప్పుడా ఎప్పుడా అని ఎదురుచూస్తున్న శుభతరుణం రానే వచ్చింది. ఇపుడు మీ ముందున్న ప్రముఖనటి కోమలాంగి. మీరంతా ఇటీవలె ఘనవిజయం సాధించిన హిట్ సినిమా 'ఇదేం సిత్రం..?' అనే సినిమా చూసే ఉంటారు. అందులో 'ఇంటెనక దొంగరో ఇంట్లోకి వచ్చిందిరో...' అనే హిట్ సాంగ్‌లో హీరో హీరోయిన్ల వెనక ఉన్న గ్రూప్ డాన్సర్స్‌లో రెండో వరుసలో ఎడం వేపు మూడో అమ్మాయిగా కన్పించిన ఆర్టిస్టే... మిస్ కోమలాంగి! ఇక వీరు... ప్రముఖ టీ.వీ. ఆర్టిస్ట్ శ్రీ కుక్కుటేశ్వర్ వీరు రెండు సంవత్సరాల క్రితం హైదరాబాద్ దూరదర్శన్‌లో ప్రసారమైన హిట్ సీరియల్ 'పారిపోండి చూద్దాం'లో దొంగకోళ్ళు పట్టుకుంటుండగా హీరోకి దొరికిన నైట్ వాచ్‌మెన్‌గా నటించిన ప్రముఖనటుడు... వీరిద్దరూ ఇపుడు ఎంతో బిజీగా ఉన్నా మేమడిగిన వెంటనే కాదనకుండా తీరిక చేసుకొని మరీ మన ఫంక్షన్‌కి విచ్చేసిన మహానుభావులు.."

అంతే! ప్రేక్షకుల వైపు చూస్తే...

మూలిగే నక్కపై తాటికాయ పడ్డట్లుయిందని వేరే చెప్పక్కర్లేదనుకుంటా...

❀



## పడవ ప్రయాణం!

నగ్మా, రియాపిళ్ళైదత్తాలు ఈ మధ్య మంచి ఫ్రెండ్స్‌గా మారిపోయారు. ఇద్దరి ఆలోచలూ ఒకటే! 'అమ్మబాబు నమ్మరాదు, ఈ రాలుగాయి అబ్బాయిల నమ్మరాదు,' అంటూ ఒకే పల్లవిని ఆలపిస్తున్నారు. వాళ్ళ వరకు పాడుకోడానికి బాగానే ఉంటోంది. అయితే వాళ్ళ గురించి ఆ అబ్బాయిలు ఏమనుకుంటున్నారో కూడా వినాలిగా!